

దీప్తి శ్రీ నగర్ పార్క్ ప్రదర్శనలో కొనుగోలు చేస్తున్న మహిళలు

కళా సిల్క్ వస్త్ర ప్రదర్శన ప్రారంభం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు, యువతులను ఆకట్టుకునే విధంగా దీప్తి శ్రీ నగర్ పార్క్‌లో ప్రారంభమైన చేనేత, వస్త్ర కళా ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు సంజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 వరకు వస్త్ర కళా ప్రదర్శనను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. భారత దేశంలో ఎంపిక చేసిన చేనేత కళాకారులకు మహిళలు మెచ్చే విధంగా అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ దుస్తులు అమ్మకానికి ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కళంకారి, ఉప్పాడ, అస్సాం రాష్ట్రానికి చెందిన మూగ, ఏరిసిల్క్స్‌తో పాటు దేశంలోని పలు రాష్ట్రాలలో తయారు చేసిన బెడ్ షీట్స్, అంబ్రాయిడరీ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9.00గం.వరకు వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



రామ్మూర్తిగౌడ్‌ను పరామర్శిస్తున్న బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య

బీసీలపై కక్ష సాధింపు తగదు: ఆర్.కృష్ణయ్య

హయత్‌నగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బీసీ బంద్‌లో గాయపడిన తుర్కయంజాల్‌కు చెందిన రామ్మూర్తిగౌడ్‌ను సోమవారం బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించినప్పటికి ప్రభుత్వం కక్ష కట్టి ప్రముఖ బీసీ నాయకులను అరెస్ట్ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నో బంద్‌లు నిర్వహించినా ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించలేదన్నారు. రాత్రి వేళల్లో పోలీసులు బీసీ నేతలను అరెస్టు చేయడం పట్ల ఆయన ఆగ్రహ వ్యక్తం చేశారు. జాతీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చేపట్టిన బంద్ విషయంలో ప్రభుత్వానికి ఎందుకంత కసి అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీల పట్ల వివక్ష మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రాంమూర్తిగౌడ్, రాంకోటి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డికి అందజేసిన వినతిపత్రాన్ని చూపిస్తున్న రాపోలు భాస్కర్

అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి

హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్

చాదర్‌ఘాట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ అన్నారు. మంగళవారం గడ్డిఅన్నారంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని కలిసి న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు యాక్ట్‌ను అమలు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో న్యాయవాదులపై అనేక రకాలుగా దాడులు జరుగుతున్నాయని, ఇంతవరకు ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 40వేల మంది న్యాయవాదులు 116 కోర్టులో సేవలందిస్తున్నారని తెలిపారు. న్యాయవాదులు వామన్ రావు, నాగమణి, మల్లారెడ్డి, విజయరెడ్డి, దశరథ, ఇజ్రాయెల్ తదితరులపై జరిగిన దాడుల్లో హత్యలే ఇందుకు నిదర్శనమన్నారు.



డీసీసీ అధ్యక్ష పదవి కోసం..

రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్ష పదవి కోసం సెలెక్షన్ కమిటీ అబ్జర్వర్, ఎంపీ రాబర్ట్ బ్రూస్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిలకు దరఖాస్తు అందజేస్తున్న ఎల్‌బీనగర్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కె.శశిధర్‌రెడ్డి

- దిల్‌సుఖ్‌నగర్, (ఆంధ్రజ్యోతి)



కొత్తపేటలో సదర్ సమ్మేళనంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్



మన్సూరాబాద్ సదర్‌లో మధుయాష్కీగౌడ్, ఏసీపీ కృష్ణయ్యను సన్మానిస్తున్న అఖిల భారత యాదవ మహాసభ సభ్యులు



మన్సూరాబాద్ చౌరస్తా వద్ద సదర్ ఉత్సవాల్లో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, ఈశ్వరమ్మ యాదవ్‌లను సన్మానిస్తున్న అఖిల భారత యాదవ మహాసభ సభ్యులు



దున్నపోతుల విన్యాసాలతో ఆకట్టుకున్న వారికి బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తున్న గణేష్‌యాదవ్, కృష్ణయాదవ్ తదితరులు

సదర్.. జోర్దార్

అంబరాన్నంటిన ఉత్సవాలు

- యాదవుల ఐక్యతకు ప్రతీక సదర్: మధుయాష్కీగౌడ్
- ఆకట్టుకున్న దున్నపోతుల విన్యాసాలు

కొత్తపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట, న్యూ మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో యాదవ సంఘం నిర్వహించిన యాదవ సదర్ సమ్మేళన సంబరాల్లో సోదరులు పార్టీలకు అతీతంగా ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. అందంగా అలంకరించిన దున్నపోతుల విన్యాసాలు అందరినీ అలరించాయి. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్త, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, కార్పొరేటర్ పవన్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు లింగాల రాహుల్‌గౌడ్, యాదవసంఘం అధ్యక్షులు తోట శ్రీనివాసయాదవ్, సలహాదారు తోట కృష్ణాయాదవ్, ప్రతినిధులు కొర్వి శ్రీనివాస్ యాదవ్, సహా పలుప్రాంతాల కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో యాదవసోదరులు పాల్గొన్నారు.



కొత్తపేట యాదవ సంఘం సదర్ సమ్మేళనంలో కార్పొరేటర్ పవన్‌కుమార్

మన్సూరాబాద్ చౌరస్తాలో..

మన్సూరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ (ఏఐవైఎంఎస్) ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మన్సూరాబాద్ చౌరస్తాలో నిర్వహించిన 'యాదవ సదర్ సమ్మేళనం' ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీపీసీసీ ప్రచారకమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, ఎల్బీనగర్ ఏసీపీ ఎ.కృష్ణయ్యగౌడ్, ఏఐవైఎంఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్‌యాదవ్, విశిష్ట అతిథులుగా కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణా సురేంద్రనాథ్‌యాదవ్, బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ యాదవుల ఐక్యతకు ప్రతీక సదర్ సమ్మేళన ఉత్సవాలని, దున్నపోతుల విన్యాసాలతో ఆద్యంతం ఆకట్టుకునే వేడుక సదర్ అన్నారు. అనంతరం యాదవ సోదరులు నిర్వహించిన దున్నపోతుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకోగా వారిని జ్ఞాపికలతో సత్కరించారు. ఈ వేడుకల్లో సంఘం గ్రేటర్ హైదరాబాద్ మాజీ అధ్యక్షుడు పోచబోయిన గణేష్‌యాదవ్, పోచబోయిన కృష్ణయాదవ్, పోచబోయిన జగదీష్‌యాదవ్, బొల్లు యాదయ్యయాదవ్, కె.జగదీష్‌యాదవ్, మల్లెల శ్రీనివాస్‌యాదవ్, పోచబోయిన రాఘవేందర్‌యాదవ్, కేశవబోయిన రవియాదవ్, పి.శ్రీకాంత్ యాదవ్, కె.చిట్టియాదవ్, కేశవబోయిన నాగేష్‌యాదవ్, పోచబోయిన మహేందర్‌యాదవ్, పోచబోయిన వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి, హైదరాబాద్ డీసీసీలు పార్టీకి వెన్నెముక లాంటివి

ఏఐసీసీ పరిశీలకుడు ఎంపీ రాబర్ట్ బ్రూస్

ఎల్‌బీనగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి, హైదరాబాద్ డీసీసీలు పార్టీకి వెన్నెముక లాంటివని డీసీసీ ఎన్నికల ప్రక్రియ ఏఐసీసీ పరిశీలకుడు ఎంపీ రాబర్ట్ బ్రూస్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియలో భాగంగా మంగళవారం కర్మన్‌ఘాట్‌లోని వేదిక కన్వెన్షన్‌లో ఎల్‌బీనగర్ నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర జనాభా మొత్తంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోనే సగం ఉంటారన్నారు. ఈ రెండు జిల్లాల్లో పార్టీ బలపడటం ఎంతో ముఖ్యమన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలమంతా కష్టపడి పని చేయాల్సి ఉందన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ నేతల ఎంపిక జరగాలన్న అధిష్టానవర్గం నిర్ణయం మేరకు డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం పార్టీ నేతల అభిప్రాయాలను సేకరిస్తున్నామని ఆయన చెప్పారు. ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా డీసీసీలను బలోపేతం చేసేందుకు పార్టీ కార్యాచరణ చేపట్టిందన్నారు. అందులో భాగంగానే డీసీసీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. పార్టీలో, నామినేటెడ్ పదవుల్లో పార్టీ కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని ఆయన కోరారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, పీసీసీ సేవాదల్ చైర్మన్ మిద్దెల జితేందర్, హెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సుజాతనాయక్, పీసీసీ మాజీ కార్యదర్శులు రామ్మోహన్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, పీసీసీ ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు ఎంపీ రాబర్ట్ బ్రూస్



ఉదయ్‌నగర్ కాలనీ అధ్యక్షుడిగా ఎన్నికైన అమరేందర్ సాగర్, కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న కాలనీ ప్రతినిధులు

ఉదయ్‌నగర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

చంపాపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని ఉదయ్‌నగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గంను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బలుగూరి అమరేందర్ సాగర్, ప్రధాన కార్యదర్శిగా దుబ్బాక శ్రీకాంత్, కోశాధికారిగా శ్రవణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ, మిగతా కార్యవర్గ సభ్యులను త్వరలో ప్రకటించనున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ ప్రతినిధుల సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

మత్స్యకార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మత్స్యకార్మిక సంఘం జెండాను ఎగురవేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ

వనస్థలిపురం,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మత్స్యకార్మికుల సమస్యలను పరిష్కరించి వారి అభివృద్ధికి కృషి చేయాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ అన్నారు. మంగళవారం వనస్థలిపురం రైతు బజార్ వద్ద మత్స్యకార్మిక సంఘం 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార్మికులకు రూ.5వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. ప్రతి సొసైటీ అకౌంట్లలో రూ.10లక్షల నగదును జమచేయాలని గోరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార్మికుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ అభినందనీయం : ఉప్పల

మన్సూరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతీ అమావాస్య రోజున అన్నపూర్ణ ఆర్యవైశ్య సంఘం అన్నప్రసాద వితరణ చేపట్టడం అభినందనీయమని టీపీసీసీ ప్రధానకార్యదర్శి, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. నాగోల్ చౌరస్తాలో మంగళవారం శ్రీవాసవి అన్నపూర్ణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పాదచారులు, పేదలకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ, ఈ సేవలను మరింత ముందుకు తీసుకెళ్లాలని సంఘం సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో నాగోల్ ఆర్యవైశ్య సంఘం ఫౌండర్, అధ్యక్షుడు జోగిని అశోక్, ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి సాయి గణేష్, వీరేందర్ పాల్గొన్నారు.



నాగోల్ వద్ద భోజనం వడ్డిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

పాన్‌షాప్ యజమానిపై కత్తితో దాడి

చంపాపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌బాబానగర్‌లోని పాన్‌షాప్ యజమానిపై కత్తితో దాడి జరిగింది. హాఫీజ్‌బాబానగర్‌లోని హజ్మత్ పాన్ షాప్ యజమాని సయ్యద్ ఖాజా (26)పై మంగళవారం తెల్లవారు జామున హాఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ ఇంతియాజ్(30)అనే వ్యక్తి కత్తితో దాడికి పాల్పడ్డాడు. పెట్రోలింగ్ పోలీసులు వస్తున్నట్లు సయ్యద్‌ఖాజా గమనించి పాన్ షాప్ మూసివేస్తుండగా తెరవాలని ఇంతియాజ్ అతనితో గొడవ పడినట్లు, అతను మాట వినకపోవడంతో ఇంతియాజ్ వెంట తెచ్చుకున్న కత్తితో నడుం వెనుక భాగంలో పొడిచి పారిపోయాడు. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ఒవైసీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు పరారీలో ఉండటంతో పూర్తి సమాచారం తెలియదని కంచన్‌బాగ్ పోలీసులు తెలిపారు.



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

స్టోర్ రూంలో అగ్నిప్రమాదం

తప్పిన ప్రమాదం

చాదర్‌ఘాట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆస్మాన్ ఘడ్‌లో గల ఇంట్లోని స్టోర్ రూంలో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మలక్‌పేట ఆస్మాన్ ఘడ్ నివాసి ఇంజనీరింగ్ కాంట్రాక్టర్ సయ్యద్ నవీద్ హసన్‌కు చెందిన జీ+2 ఇంట్లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న స్టోర్ రూంలో అగ్నిప్రమాదం జరిగింది. స్టోర్ రూంలో నిల్వచేసిన పాత ఫర్నిచర్, పాడైన బుక్స్ కాలిపోయాయి. పోలీసులు, అగ్నిప్రమాపక సిబ్బంది చేరుకుని, మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఆ సమయంలో ఇంట్లోని మొదటి అంతస్తులో ఏడుగురు వ్యక్తులు ఉన్నారు. వీరెవరికి ప్రమాదం జరగలేదని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణాలపై ఆరా తీస్తున్నారు. బాధితుడు సయ్యద్ నవీద్ హసన్ ఇంతవరకు ఫిర్యాదు చేయలేదని మలక్‌పేట పోలీసులు తెలిపారు.



చంపాపేటలో అన్నదానం ప్రారంభిస్తున్న భగవత్

అన్ని దానాల్లో కెల్ల అన్నదానం గొప్పది

చంపాపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అన్ని దానాలలో కన్నా అన్నార్థులకు అన్నదానం చేయడం గొప్పదని మాతా అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ భగవత్ జీ అన్నారు. చంపాపేటలోని శ్రీ నల్ల, ఎర్ర పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో మంగళవారం అమావాస్యను పురస్కరించుకొని శ్రీ అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో 500 మందికి అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రవిముదిరాజ్, సుశీల్‌కుమార్, సంతోష్‌లడ్డా, తదితరులు పాల్గొన్నారు.



దీపావళి వేడుకల్లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు



సుబ్రమణ్యంనగర్ కాలనీలో టపాకులు కాలుస్తున్న దృశ్యం



చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి దర్శించుకున్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

దేదీప్యమానం.. దీపావళి సంబరం

జోన్‌బృందం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్, మలక్‌పేట, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలో దీపావళి పర్వదిన వేడుకలు అంబరాన్నంటాయి. ఇళ్లు, దుకాణాలు విద్యుత్ దీపాల తోరణాలతో వెలుగులు జిమ్ముతుండగా వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. సాయంకాలం మతాబులు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, రకరకాల బాంబులు కాల్చుతూ పండుగ సంబరాన్ని అంబరాన్ని చుంబించేలా జరుపుకున్నారు. ధూప, దీప, నైవేద్యాలతో శోభిల్లిన ఆలయాలు భక్తజన ప్రవాహంతో పోటెత్తాయి. వ్యాపారస్తులు లక్ష్మీ పూజలు నిర్వహించారు. దీపావళి పండుగ సందర్భంగా పూలకు విపరీతంగా ధరలు పెరగడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. మిఠాయి దుకాణాలు వినియోగదారులతో కిక్కిరిసిపోయాయి. స్నేహపురి పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా శ్రీలక్ష్మీ పూజలు, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.



దీపావళి పురస్కరించుకొని బొమ్మల కొలువు వద్ద మహిళలు





స్నేహపురి పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చన



కొత్తపేటలో బొమ్మల కొలువు



ప్రత్యేక పూజల్లో వ్యాపారి



టపాసులు కాల్చుతున్న కుటుంబం